ఓటుతో టీడీపీకి బుద్ధి చెబుదాం


నరసాపురంలో ప్రచారం చేస్తున్న శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

• శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

నార్పల: వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని శింగనమల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు కోరారు. సోమవారం ఆయన మండలంలోని నరసాపురం, నీలితొట్టిపల్లి, దుగుమర్రి, తుంపెర, గంగనపల్లి, ముచ్చుకుంటపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు. మందుగా వారు ఆయా గ్రామాలకు చేరుకోగానే నాయకులు, కార్యకర్తలు డప్పు, వాయిద్యాల మధ్య బాణసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. వారు ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వీరాంజనేయులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పేదల ప్రభుత్వమన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. టీడీపీ ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం.. గెలిచిన తరువాత మరచిపోవడం గతంలో చూశామన్నారు. కానీ జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వంద శాతం నెరవేర్చిన గొప్ప నాయకుడన్నారు. ప్రతిపక్ష నాయకులు ఇళ్ల వద్దకు వచ్చి మోసపు మాటలు చెబుతున్నారన్నారు. చంద్రబాబు ఇస్తున్న దొంగ హామీలను, జగనన్న ప్రభుత్వంపై చేసే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు. ఫ్యాన్ గుర్తుకు మరో మారు ఓటు వేసి ప్రతి పక్షాలకు బుద్ధి చెబుదామన్నారు. జగనన్నకే జనం మద్దతు ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, సర్పంచు కుళ్లాయిరెడ్డి, నాయకులు రమణారెడ్డి, నారాయణరెడ్డి, బయపరెడ్డి, శేఖర్‌రెడ్డి, నాగార్జున, హనుమంతురెడ్డి, ఎంఎస్ నాయుడు, రమణ, వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో సోదరభావం

• ఎమ్మెలే అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ


ఇఫ్తార్ విందులో పాల్గొన్న వీరాంజనేయులు, శంకరనారాయణ, పైలా

నార్పల: ఇఫ్తార్ విందుతో సోదర భావం ఏర్పడుతుందని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. సోమవారం వారు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొరుసు రమణారెడ్డి, సంజీవ రెడ్డి నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. వారితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మాట్లాడుతూ అల్లా పట్ల భక్తి విశ్వాసాలు, మత సామరస్యం, సోదరభావం, ప్రజల మధ్య ఆత్మీయతలు ఇఫ్తార్ విందు ద్వారా పెంపొందుతాయన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు ఉండటం ద్వారా దైవ చింతన, నియమబద్ధమైన జీవితం అలవాటు అవుతుందన్నారు. అనంతరం ముస్లిం పెద్దలను వారు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, సప్తగిరిరెడ్డి, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నాయకులు కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాహుల్, శీనా తదితరులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు


ఎమ్మెల్యే వైవీఆర్


ఎమ్మెల్యే పద్మావతి


ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

గుంతకల్లుటౌన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది ప్రజల జీవితాల్లో వసంతాన్ని నింపి, అన్ని శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా జీవించాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆయన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

శింగనమల: నియోజకవర్గ ప్రజలందరూ ఉగాది పండుగను ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు కోరారు. ఈ తెలుగు సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని, రైతులకు మేలు జరిగి, పంటలు బాగా పండాలని కోరుకుంటున్నామన్నారు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో బైక్‌ను డ్రైవ్ చేస్తున్న పోతుదొడ్డికి చెందిన రాజు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


8వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని గుత్తి ఆర్ఎస్‌లోని 8వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు కోనా మురళీధర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, పార్టీ పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నాయకులు రాజ్‌కుమార్ రెడ్డి, గురు ప్రసాద్‌యాదవ్, బేడల వెంకటరాముడు మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మలత ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా వై.వెంకటరామి రెడ్డి, అనంతపురం ఎంపీ అభ్యర్థిగా శంకర నారాయణను గెలిపించాలన్నారు.. కార్యక్రమంలో కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ, అర విందబాబు, ఫరూక్, కేవీ రమణ, వెంకట సుబ్బయ్య, నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు సీవీ రంగారెడ్డి, మర్తాడు అన్వార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాలు ఎంతో అవసరం


ప్రాజెక్ట్ ఉపయోగాలను వివరిస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్‌పో–2024 ఘనంగా నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్లు రఘుబాబు, సుమిత వ్యవహరించారు. కార్యక్రమంలో టీపీఓ రంజిత్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివ లింగమయ్య, డాక్టర్ రాజు, రవి చంద్ర, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ


ప్రతిభ కనబరిచిన శశితో హెచ్‌ఎం, పీడీలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న శశి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. మార్చి 28 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగబాద్ వేదికగా సబ్ జూనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న శశి.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరిచిన శశిని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశు, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

నకరాకు నివాళి

తాడిపత్రి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సకాలంలో పెన్షన్ పొందుతూ ప్రశాంతంగా జీవనం గడుపుతున్నారంటే దాని వెనుక ఒక గొప్ప వ్యక్తి ఉన్నారని ఆయనే డీఎస్ నకరా అని పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం టీచర్స్ కాలనీలోని పెన్షనర్ల భవన్‌లో నకరా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పెన్షనర్లందరూ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

జాగ్రత్తలు పాటించండి


తిలక్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వాతి

గుంతకల్లుటౌన్: వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలుల కారణంగా వడదెబ్బ (సన్‌స్ట్రోక్), డీహైడ్రైషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు స్వాతి, సంజీవ్ సూచించారు. సోమవారం పట్టణంలోని తిలక్‌నగర్, నాయీబ్రాహ్మణ కాలనీల్లో వైద్యులు, సిబ్బంది పాల్గొని వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ 65 యేళ్లు పైబడిన వారు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు ఎండ అధికంగా ఉన్నప్పుడు బయట తిరగరాదన్నారు. వడదెబ్బ లక్షణాలు, ప్రథమ చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుంటాం


గుంతకల్లులో రాజీనామా అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న వలంటీర్లు

గుంతకల్లుటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుంటామని వలంటీర్లు అన్నారు. నిస్వార్థంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న తమను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు కించపరిచే వ్యాఖ్యలు చేస్తూ, విధులను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని 3వ వార్డుకు చెందిన 11 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వలంటీర్లు సికిందర్, నరేష్, రామ్మోహన్, అఖిల్, నాగరాజు, సాయినిరంజన్, హరీష్, రవి, మధు, జాఫర్, రాజ్‌కుమార్ తమ రాజీనామా పత్రాలను వార్డు అడ్మిన్ సెక్రటరీ ధనుంజయ ద్వారా మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసిన తమపై రాజకీయ రంగు పులమడమే కాకుండా అనేక నిందలు వేశారంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విజయం కోసం కృషి చేస్తామన్నారు. జగనన్నను గెలిపించుకోవడానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసిన వలంటీర్లను కౌన్సిలర్ గంగమ్మ, వార్డు ఇన్‌చార్జ్ రాజశేఖర్ అభినందించారు.

9 మంది వలంటీర్ల రాజీనామా

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకుపల్లి సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 9 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడంతోపాటు తాడిపత్రి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలించుకోవడం కోసం స్వచ్ఛందంగా రాజీనామాలు చేసినట్లు వలంటీర్లు చౌడయ్య, నరేంద్ర, బీబీఫాతిమా, శాంతి, బాల వన్నూరు, రాజశేఖర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, శరత్‌కుమార్, అంజలి తెలిపారు. వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి దామోదర్‌రెడ్డికి అందజేసినట్లు వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించండి


12వ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మైనార్టీ యువకులు

• ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ప్రజల ఆశీర్వాదం, సీఎం జగనన్న సహకారంతో గుంతకల్లు నియోజకవర్గం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేసిన తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి 12వ వార్డు ప్రజలను కోరారు. సోమవారం ఎమ్మెల్యే వైవీఆర్ కథలగేరిలో పర్యటించి వార్డు పెద్దలతో సమావేశమై మద్దతు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అట్టడుగువర్గాల అభ్యున్నతి జరగాలన్నా, పేదరిక నిర్మూలన కావాలన్నా మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బేడ బుడగజంగాల కులస్తుల సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమన్నారు. జగనన్న వస్తేనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను ఈ సారి ఎన్నికల్లో ఆశీర్వదించాలని వైవీఆర్ అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, కౌన్సిలర్ పెద్ద వెంకటేశ్వర్లు, వార్డు పెద్దలు లింగన్న, ఎల్లప్ప, నాగూర్, షేక్షావలి, సూరి, రమేష్, రామకృష్ణ, ఆంజనేయులు, మస్తాన్, వాల్మీకి బీకే శివ, మార్కెట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి మైనార్టీ యువకుల చేరిక

గుంతకల్లు పట్టణంలోని ధర్మవరం గేట్, పోర్టర్స్ లైన్ ఏరియాలకు చెందిన 25 మంది మైనార్టీ యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సమక్షంలో ఈద్గా ఫంక్షన్‌హాల్ కమిటీ చైర్మన్ మౌలా ఆధ్వర్యంలో బళ్లారి గౌస్, బళ్లారి హన్నూ, అక్బర్, గులామ్, ఇష్తికర్, అన్వర్, తస్లీమ్, ఇస్మాయిల్, మైనుద్దీన్, సాహిల్‌తో పాటు వారి స్నేహితులు పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే వైవీఆర్ పార్టీ కండువాలు వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వారికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ.ఖలీల్, నూర్‌నిజామి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన


మాట్లాడుతున్న ఆర్వో రామభూపాల్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఎంసీసీ నిబంధనలు, నామినేషన్ల ప్రక్రియ, నూతనంగా ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆర్వో ఓ.రామభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు పోలింగ్ శాతాన్ని పెంచే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో బాగంగా ఈ నెల 14వ తేదీ వరకు ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. బీఎల్ఓ, మీసేవా, ఎన్‌వీఎస్‌టీ హెల్ప్ లైన్ పోర్టల్ ద్వారా కూడా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) ప్రకారమే రాజకీయ పార్టీలు ప్రచారం చేయాలన్నారు. నామినేషన్ల ప్రక్రియపై రాజకీయ నాయకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. నామినేషన్ దాఖల సమయంలో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఎలాంటి బ్లాంక్ లేకుండా చూసుకోవాలన్నారు. చెక్‌లిస్ట్ ప్రకారం నామినేషన్ ఫారం సమర్పించాలన్నారు. అనంతరం హోమ్ ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

యాడికి: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో బీఎల్ఓలకు సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

మహిళ దుర్మరణం


హుసేనమ్మ మృతదేహం

గుత్తి రూరల్: వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం కొంగనపల్లికి చెందిన హుసేనమ్మ (58) సోమవారం ఉదయం గుత్తికి వచ్చి ఉగాది పండుగకు అవసరమైన సరుకులు కొనుగోలు చేసి మధ్యాహ్నం ఆటోలో తిరుగు ప్రయాణమైంది. గుత్తి మండలం లచ్చానుపల్లి శివారులోకి చేరుకోగానే గుంతకల్లు మండలం మైనాపురం తండాకు చెందిన దీప్లానాయక్ ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ ఆటోలో కూర్చొని తల బయట పెట్టిన హుసేనమ్మను ఢీకొన్నాడు. ఘటనతో తల ఛిద్రమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడడంతో దీప్లానాయక్ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువ నేత సీబీ మంజునాథరెడ్డి... గుత్తి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని మృతురాలికి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.


పండుగ సామగ్రి కొనుగోలుకు వచ్చిన ప్రజలతో కిటకిటలాడుతున్న గుత్తిలో అమృత్ థియేటర్ ప్రాంతం

• ఉగాది సందడి

గుత్తి: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో సోమవారం ఉగాది సందడి నెలకొంది. గుత్తిలోని అమృత్ సినిమా థియేటర్ కాలనీ, కూరగాయల మార్కెట్, ఆర్ఎస్‌లోని మెయిన్ బజార్‌లోని ప్రధాన కూడళ్లు జనాలతో కిక్కిరిసి పోయాయి. ఈ సందర్భంగా కిరాణా దుకాణాలు, దుస్తుల షాపులు కిటకిటలాడాయి.

నేడు 'కోన'లో ప్రత్యేక పూజలు

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. ఆలూరు గ్రామంలో సాయంత్రం స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. అలాగే మండలంలోని గంగాదేవిపల్లిలో వెలసిన గంగాభవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముసలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో ముసలమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం కుంకుమ అర్చనలు అభిషేకాలు చేశారు. సాయంత్రం 6 గంటలకు గంగా పూజ, గణపతి పూజ, ప్రాయశ్చిత సంకల్పం స్వస్తి పుణ్యహావాచన, రక్షా బంధన, మహా మంగళ హారతి కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉదయం కుంభాబిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుశీలమ్మ, తెలిపారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

తాడిపత్రి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకే కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని తాడిపత్రి డీఎస్పీ సి.ఎం.గంగయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని పుట్లూరు రోడ్డు, సంజీవనగర్, విజయనగర్ కాలనీ, వాటర్‌వర్క్స్‌రోడ్డు, సీబీ రోడ్డు గుండా అశోక్ పిల్లర్ మీదుగా అర్బన్ పోలీస్ స్టేషన్ వరకూ కవాతు నిర్వహించారు. ఎన్నికల విధులపై వచ్చిన కేంద్ర బలగాలకు ఆయా ప్రాంతాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ కమాండెంట్ సంతోష్‌భట్, అర్బన్ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు గౌస్‌బాషా, నాగవీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధిమాంద్యంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణులు

గార్లదిన్నె: చిన్న వయస్సులో మెదడు ఎదుగుదల లోపం వల్ల బుద్ధిమాంద్యం వస్తుందని మానసిక వైద్య నిపుణుడు విశ్వనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుద్ధిమాంద్యంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కొంత మందిలో గర్భస్థ సమయంలో బిడ్డలో జరిగే జన్యు మార్పుల వల్ల బుద్ధిమాంద్యం సంభవిస్తుందన్నారు. ఈ జబ్బు కలిగిన పిల్లల్లో మానసిక ఎదుగుదల ఆలస్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గౌతమి, దిలీప్ కుమార్, సూపర్ వైజర్లు సూర్యకళ, కృష్ణమోహన్, విశ్వనాథ్, మిడ్‌లెవల్ హెల్త్ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడికి రూ.లక్ష విరాళం

గుంతకల్లు రూరల్: నంద్యాల జిల్లాకు చెందిన ఎం.పవన్ కుమార్ అనే భక్తుడు సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.1,00,116 విరాళం అందజేశారు. ఆలయ అన్నదాన సత్రం నిర్వహణ నిమిత్తం ఈ మొత్తాన్ని అందజేసినట్లు దాత తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కల్లూరులో ఇసుక మూట ఎత్తే పోటీలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో యువకులకు 120 కిలోల ఇసుక మూట ఎత్తే పోటీలు నిర్వహించనున్నారు. సోమవారం గ్రామస్తులు మాట్లాడుతూ కొండకింద కొట్టాల ఆంజనేయ స్వామి గుడి వద్ద ఇసుక మూట ఎత్తే పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.5,000, రెండో బహుమతి రూ.2500, మూడో బహుమతిగా రూ.1,500, నాలుగో బహుమతిగా రూ.1000 అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న యువకులు పోటీల్లో పాల్గొనాలన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నార్పల: మండలంలోని కేసేపల్లిలో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బండి నాగానంద (45), భార్య లక్ష్మి నిత్యం గొడవపడుతుండేవారు. ఇదే క్రమంలో భార్యతో గొడవపడిన ఆయన మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, కుమారుడు,కుమార్తె ఉన్నారు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై టీడీపీ కార్యకర్త దాడి

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు గ్రామంలో సోమవారం లక్ష్మీనారాయణమ్మ అనే వృద్ధురాలు ఉగాది పండుగ సందర్భంగా ఇంటి ముందు కళ్లాపు చల్లుతుండగా ఎదురుగా ఉన్న గంగన్న అనే టీడీపీ కార్యకర్త మా ఇంటిపైనే నీళ్లు చల్లుతావా అంటూ దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేశామని పోలీసులురు.